
సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



భీమిలి ప్రేమలు 8లో

ప్రేమ కథా చిత్రాల చిత్రీకరణకు భీమిలి స్వర్గ ధామంలా నిలిచింది. ఇక్కడ ఎన్నో సూపర్ హిట్ ప్రేమకథా చిత్రాలు చిత్రీకరించారు.



కేశవస్వామి పుష్పాంజలి సేవ

శ్రీకేశవస్వామివారి పుష్పాంజలి సేవ కనువిందుగా జరిగింది. వందలాది మంది భక్తులు స్వామివారి ఊంజల సేవలో పాల్గొన్నారు. 8లో

ఏలూరులో వందే భారత్‌కు హాల్ట్ పొడిగింపు

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20707)కు ఏలూరు స్టేషన్‌లో మరో ఆరు నెలలపాటు హాల్ట్ పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ రైలు ఉదయం 9.49 గంటలకు ఏలూరు చేరుకొని, 9.50గంటలకు బయల్దేరుతుంది.

న్యూస్‌రీల్

మాఘపౌర్ణమి ప్రత్యేక బస్సులతో రూ.8.33 లక్షల ఆదాయం

అనకాపల్లి : మాఘపౌర్ణమిని పురస్కరించుకుని అనకాపల్లి (ఆర్టీసీ)డిపో నుంచి పూడిమడక సముద్రస్థానానికి 35 ప్రత్యేక బస్‌లు ద్వారా డిపోకు ఈ ఏడాది రూ.8,33,083 ఆదాయం వచ్చిందని డిపో ఇన్‌ఛార్జ్ మేనేజర్ రవిచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది 35 బస్‌లు ద్వారా రూ.8,16,143 ఆదాయం రాగా ఈ ఏడాది ఆదనంగా రూ.16,940 వచ్చినట్లు ఆయన చెప్పారు.

కశింకోట ఆర్‌ఈసీఎస్ ఎండీగా ప్రసాద్



కశింకోటలో ఆర్‌ఈసీఎస్ ఎండీగా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ప్రసాద్

కశింకోట : కశింకోటలోని ఆర్‌ఈసీఎస్ (గ్రామీణ విద్యుత్ సహకార సంఘం) మేనేజింగ్ డైరెక్టర్‌గా ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్(ఆపరేషన్) జి. ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలతో పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించిన మేరకు స్థానిక సంఘ కార్యాలయం ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. జాయినింగ్ రిపోర్టును సంఘ పర్సన్ ఇన్‌ఛార్జి అయిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు ఇతర అధికారులకు పంపారు. ఏపీఈపీడీసీఎల్‌తోపాటు ఆర్‌ఈసీఎస్ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అనకాపల్లి డివిజన్ ఏపీఈపీడీసీఎల్ డీఈ రాజశేఖర్, కశింకోట డివిజన్ డీఈ రామకృష్ణారావు, ఏఏవో మధు, జేఏవో వెంకటేష్, ఉద్యోగులు సుధాకర్, సంతోష్‌నాయుడు, పరదేశినాయుడు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు



ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మునగపాక : ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు కోరారు. మునగపాక సచివాలయంలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. రిజిస్ట్రీతో రైతులకు పీఎం కిసాన్‌తో పాటు అన్నదాత సుఖీభవ పథకాలు ద్వారా లబ్ధి అందుతుందన్నారు. అధికారులు స్థానికంగా అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని ఈ నెల 25లోగా వినియోగించుకోవాలని అన్నారు. రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, లింక్ చేయించుకున్న ఫోన్ నంబరుతో కూడిన ఫోన్‌ను తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి, ఏఈవో షణ్మిణి దేవి, వీఏఏ సింధూజ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



దేవరశెట్టి వెంకటేశ్వర్లు, గురుకుల విద్యాలయాల కన్వీనర్

అనకాపల్లి : మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025–26 ఏడాదికి ఇంటర్, 5వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థులకు ప్రవేశపరీక్ష, 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల కన్వీనర్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ (బాలికలు)పరవాడ మండలం తానాం గ్రామంలో, ఇంటర్ (బాలురు) సింహాచలంలోని గురుకులాల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ సీట్లు అందుబాటులో ఉన్నాయని, పాయకరావుపేట, చోడవరంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 15 నుంచి మార్చి 3వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు https//mjpapbcwreis.apafss.in సంప్రదించాలని సూచించారు. ప్రవేశ పరీక్ష మార్చి 28న ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

- నర్సీపట్నం నియోజకవర్గంలో పలు శాఖలకు అధికారులు లేక అవస్థలు
- బదిలీలు, పదవీ విరమణలతో ఏర్పడిన ఖాళీలు
- ఎంపీడీవోతో పాటు పలు కీలక పోస్టుల్లో ఇన్‌చార్జిలే

స్పీకరు ఇలాకాలో ఇన్‌చార్జిలే దిక్కు!



తలుపులు మూసి ఉన్న నాతవరం ఎంపీడీవో కార్యాలయం గది



తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల కొరతతో ఖాళీ కుర్చీలే దర్శనం

నాతవరం : అసెంబ్లీ స్పీకరు ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గంలో అధికారుల కొరత వెంటాడుతోంది. నాలుగు మండలాల పరిధిలో మొత్తం 61 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 671 మంది వివిధ శాఖలకు సంబంధించి సచివాలయ ఉద్యోగులు ఉండాలి. ప్రస్తుతం పని చేస్తుంది సచివాలయాల్లో కేవలం 394 మంది మాత్రమే. తర్వాత నాతవరం ఎంపీడీవో పోస్టు నెలలు తరబడి ఖాళీగా ఉంది. నర్సీపట్నం మండలం ఎంపీడీవో కె.ఉషాశ్రీకి అదనపు బాధ్యతలు అప్పగించి కాలం వెళ్లదీస్తున్నారు. ఆమె ఇన్‌చార్జి కావడంతో ఎప్పుడు కార్యాలయానికి వస్తారో తెలియని పరిస్థితి. మండలంలో ఉన్నతాధికారులు, స్పీకరు పర్యటనల సమయంలో మాత్రమే కచ్చితంగా అందుబాటులో ఉంటారని మండలవాసులు చెబుతున్నారు. రెగ్యులర్ ఎంపీడీవో లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులపై పూర్తిగా పర్యవేక్షణ కొరవడింది.

సచివాలయాల్లో అరకొరే...

మండలంలో మొత్తం 17 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో 187 మంది ఉద్యోగులు పని చేయాలి. కానీ కేవలం 86 మంది మాత్రమే ఉన్నారు. గునుపూడి సచివాలయంలో ఒక్కరే పని చేస్తున్నారు. చెర్లోపాలెం, గన్నవరం, చమ్మచింత, వల్సంపేట, శృంగవరం, నరుగుడు, నాతవరం రెండు సచివాలయాల్లో ఇద్దరు ముగ్గురు చొప్పున పని చేస్తున్నారు. గునుపూడి సచివాలయంలో అయితే పని చేస్తున్న ఏకైక వ్యక్తి అత్యవసర సమయంలో సెలవు పెడితే సచివాలయం తలుపులు తెరిచే వారే ఉండరు.

ఏ శాఖ చూసినా...

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంటు, జూనియర్ అసిస్టెంటు, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరితో పాటు కొన్ని రెవెన్యూ అధికారులు, వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇంఛార్జిలతో కాలం వెళ్లదీస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్, సర్వే డీటీ, సర్వేయరు కలెక్టరు, ఆర్డీవో కార్యాలయాలకు మీటింగ్‌కు వెళ్తే తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తుంటాయి. గొలుగొండ మండలంలో పంచాయతీరాజ్‌శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ జెఈల పోస్టులతో పాటు మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. పలువురు వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శుల పోస్టులు నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండలాల్లో ఖాళీగా ఉన్నాయి.

నియోజకవర్గంలో సచివాలయాలు, అధికారుల వివరాలు

మండలం పేరు	సచివాలయాలు	ఉండాల్సిన సంఖ్య	ఉన్న సంఖ్య
నాతవరం	17	187	86
నర్సీపట్నం	09	99	58
గొలుగొండ	20	220	148
మాకవరపాలెం	15	165	104

పశువైద్య కేంద్రాలకూ ఇన్‌చార్జిలే...

నాతవరం మండలంలో మూడు పశువైద్యకేంద్రాలు ఉండగా వాటిలో నాతవరం పశువైద్యాధికారి తప్ప మిగతా కేంద్రాల్లో పశు వైద్యులు లేరు. ఇంచార్జిలతోనే నడుస్తున్నాయి. జిల్లా ఇరిగేషన్ శాఖకు సంబంధించి జిల్లా ఆఫీసు నర్సీపట్నంలోనే ఉంది. ఇక్కడ ఇరిగేషన్ శాఖకు రెగ్యులర్ ఈఈ లేక ఇంఛార్జి ఈఈగా డీఈ బాలసూర్యంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే కొన్ని జేఈలు పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. గతంలో పని చేసే అధికారులు కొంతమంది పదవీ విరమణ చేయగా మరికొందరు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఆయా స్థానాల్లో కొత్త అధికారులు ఈ నియోజకవర్గానికి రావడానికి ఆసక్తి చూపడం లేదని బహిరంగంగా అంటున్నారు. ఇక్కడ నుంచి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లిన అధికారుల నుంచి కూడా అదే మాట వినిపిస్తుంది. పూర్తి స్థాయిలో అధికారులు లేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు నత్తనడక నడుస్తున్నాయి.

అధికారులు లేక ఇబ్బంది



పూర్తి స్థాయి అధికారులు లేక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గతంలో ప్రతి పని సచివాలయంలోనే జరిగేది. కొంతమంది బదిలీపై వెళ్లిపోయారు. వారి స్థానంలో కొత్తగా అధికారులు రాలేదు. మీది స్పీకరు ప్రాంతం మేము అక్కడ పని చేయడానికి భయమేస్తుందని అంటున్నారు.

–సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, నాతవరం

అధికారుల కొరతపై దృష్టి సారించాలి



నియోజకవర్గంలో అధికారుల కొరతపై స్పీకరు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రభుత్వం ప్రవేశ పెట్టే పథకాలు ప్రజలకు సకాలంలో అందాలంటే క్షేత్ర స్థాయిలో పని చేసే వివిధ శాఖల అధికారులు పూర్తి స్థాయిలో ఉండాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే పూర్తి స్థాయి అధికారులు లేకపోతే స్పీకరుపై ప్రజలకు ఎలాంటి అభిప్రాయం ఉంటుందనే విషయం పరిశీలించుకోవాలి

–బాలేపల్లి వెంకటరమణ జిల్లా కార్యదర్శి, సీపీఐ

ఐటీఐలో జాబ్‌మేళా నేడు

కంచరపాలెం : కంచరపాలెం దరి ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె శ్రీకాంత్ తెలిపారు. దుబాయికి చెందిన ఈమీకామ్ సర్వీసస్, హైదరాబాద్‌కి చెందిన ఈక్విక్, డైస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఐటీఐలో ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్ ట్రేడుల ఉత్తీర్ణత చెంది, 18–25 లోపు వయసు గల అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 91219–83798 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కోనాంలో కేంద్ర బృందం పర్యటన



గిరిజనులతో మాట్లాడుతున్న బృందసభ్యులు

చీడికాడ: మండలంలోని కోనాం పంచాయతీలో గిరిజనులకు అందుతున్న వైద్యసేవలపై జాతీయ ఆరోగ్య మిషన్‌కు చెందిన కేంద్ర బృందం ఆరా తీశారు. గురువారం మధ్యాహ్నం వారు కోనాం సబ్‌సెంటర్‌లో ముందుగా రికార్డులు పరిశీలించారు. అనంతరం సంతకు వచ్చిన గిరిజనులతో మాట్లాడుతూ చిన్న పిల్లలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా పీవీటీజీల (గిరిజనులకు) స్థితిగతులు, అందుతున్న వైద్యసేవలపై అధ్యయనంలో భాగంగా కేంద్ర బృందం సభ్యులైన డాక్టర్ కన్నన్, డాక్టర్ శృతి,డాక్టర్ దీపికతో పాటు స్టేట్ గిరిజన సంక్షేమ ప్రోగాం అధికారి ఎం.రమేష్ ఆరా తీశారు. వీరితో పాటు చీడికాడ వైద్యులు సునీల్ తదితరులున్నారు. ఈ సందర్భంగా వారు సర్పంచ్ సలుగు ఈశ్వరమ్మతో పాటు గిరిజనులను కలిసి వారికి అందుతున్న సేవలను వివరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 10 మంది

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో పది మంది అభ్యర్థులు నిలిచినట్లు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం గడువు కాగా.. ఏ ఒక్కరూ ఉపసంహరించుకోలేదని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో డీసీపీ అజిత, ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీశంకర్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 27వ తేదీ పోలింగ్, మార్చి 3న కౌంటింగ్ జరగనుందని తెలిపారు. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, దానిలో భాగంగా వివిధ స్థాయి అధికారులతో 12 ఎంసీసీ బృందాలను నియమించామని చెప్పారు. అలాగే మండలానికి ఒకటి చొప్పున 11 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

ఓటర్లు 22,493.. పోలింగ్ కేంద్రాలు 123

ఉత్తరాంధ్ర పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుష ఓటర్లు 13,508 మహిళా ఓటర్లు 8,985 మంది ఉన్నారని పేర్కొన్నారు. అలాగే 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూరుస్తున్నామని, వెబ్ కాస్టింగ్, వీడియో గ్రఫీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఓటర్లకు వివరాలతో కూడిన స్లిప్పులను అందజేస్తామన్నారు.

ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్!

కౌంటింగ్ ప్రక్రియను ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి నివేదించామని ఆమోదం వస్తే పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఈఈఈ బ్లాక్‌ను గుర్తించామని వివరించారు. డీసీపీ అజిత మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఎన్నికలకు అభ్యర్థులు సహకరించాలి

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నామినేషన్ ఉప సంహరణ ప్రక్రియ గడువు ముగిసిన వెంటనే పోటీలో ఉంటున్న అభ్యర్థులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, ప్రచారం, అనుమతుల విషయంలో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. వాహనాలు, కరపత్రాల ముద్రణ, ప్రచారం వంటి అంశాలకు సంబంధించిన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో డెస్కు ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి నేరచరిత్ర లేని వారిని పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలని సూచించారు. పోలింగ్‌కు 48 గంటల ముందుగా ప్రచారం నిలిపివేయాలని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



బ్యాలెట్ బాక్సుల వివరాలను పరిశీలిస్తున్న అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల తలుపు మూసివేసి సీల్ వేయాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు తీసుకొని వచ్చే బస్సుల రూట్ మ్యాప్‌ను పరిశీలించిన ఆమె ఎన్నికలు అయిన వెంటనే బ్యాలెట్ బాక్స్‌లను త్వరితగతిన విశాఖపట్నం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ, జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవా ప్రసాద్, ఆర్డీవో షేక్ అయిషా, డీఎస్పీ శ్రావణి, ఎలక్షన్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లాభసాటిగా అపరాలు, ఉద్యాన పంటలు

- జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు
- దిమిలిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



మామిడి తోటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవనాధికారి ప్రభాకర్‌రావు



దిమిలిలో ఉద్యాన వన పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

రాంబిల్లి (యలమంచిలి) : ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాలు, అపరాలు సేద్యంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయధికారి బి.మోహనరావు కోరారు. గురువారం రాంబిల్లి మండలం దిమిలి, కట్టుబోలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అనకాపల్లి శాస్త్రవేత్తల బృందంతో కలసి ప్రకృతి వ్యవసాయం యాజమాన్య పద్ధతులు, అపరాలు సాగు, చిరుధాన్యాలు, ఉద్యాన వన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం చిరుధాన్యాలు, అపరాలు పంటలు వేయడం రైతులకు లాభసాటిగా ఉంటుందని తెలిపారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా భూమి పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తరువాత 11 అంకెల యూనిక్ ఐడీ వస్తుందని తెలిపారు. దీనిని బట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పంట రుణాలు, పంట నష్ట పరిహారం, ధాన్యం కొనుగోలు, సబ్సిడీపై యంత్ర పరికరాలు పొందడానికి అర్హులవుతారని రైతులకు తెలిపారు. పంటల్లో వచ్చే తెగుళ్ల యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ, ఎరువుల వినియోగంపై వివరించారు. దిమిలి, కట్టుబోలు గ్రామాల రైతులు తమ పంట పొలాల్లో పండించిన ఉద్యాన పంటలను ఆయన పరిశీలించి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీధర్, సి.హెచ్.సుబ్రమణ్యం, ఏడీఏలు, పి.విజేత, మండల వ్యవసాయాధికారి సుమంత పాల్గొన్నారు.

పాయకరావుపేట : జిల్లా ఉద్యానవనాధికారి ప్రభాకర్‌రావు మామిడి తోటలను పరిశీలించారు. తాండవ వ్యాలీ రైతుల ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో మండలంలో గల సీతారాంపురం గ్రామంలో మామిడి తోటలను పరిశీలించి, ప్యాక్ హౌస్‌ను పరిశీలించారు. పండించిన కూరగాయలు, మామిడి, జీడి మామిడి తదితర పంట కోసిన తర్వాత మార్కెట్‌కు వెళ్లేలోపు గ్రేడింగ్ ప్యాకింగ్ చేసుకునే హౌస్‌ను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఈ సీజన్‌లో పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నట్టు జిల్లా ఉద్యానవనాధికారి ప్రభాకర్‌రావు తెలిపారు. ఆయనతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘం సిఈవో జి.వి.వి సత్యనారాయణ ఉన్నారు.

కరెంట్ భారం రూ.250 కోట్లు

ఉమ్మడి విశాఖ జిల్లాలో...

ఎల్‌టీ కేటగిరీ వినియోగదారులు 18,42,691

ప్రతి నెలా డిమాండ్ రూ.1,457.01 కోట్లు

హెచ్‌టీ కేటగిరీ వినియోగదారులు 1,858

ప్రతి నెలా డిమాండ్ రూ.3,903.51 కోట్లు

మొత్తం వినియోగదారులు 18,44,549

మొత్తం డిమాండ్ రూ.5,360.52 కోట్లు

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా అదనపు భారం రూ.250 కోట్లు




- ప్రతి నెలా అదనపు చార్జీల పేరుతో దోచుకుంటున్న డిస్కమ్
- ఒక్క యూనిట్‌కి రూ.400 బిల్లు వేసిన ఏపీఈపీడీసీఎల్
- సంపద సృష్టిస్తామంటూ ప్రజల సంపద హరిస్తున్న ప్రభుత్వం



సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోం.. అవసరమైతే తగ్గిస్తామంటూ ఊదరగొట్టిన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. ఇప్పుడు సంపద సృష్టి పేరుతో పేదల కష్టాన్ని లాగేసుకుంటున్నారు. తమ ఖజానా నింపేసుకునేందుకు సామాన్యుల సంపదను హరించేస్తున్నారు. ప్రతి నెలా రకరకాల చార్జీల పేరుతో విద్యుత్ బిల్లులు వేస్తుంటే.. వినియోగదారుల గుండె గుభేల్ మంటోంది. ఈపీడీసీఎల్ పరిధిలో ఒక్క యూనిట్ విద్యుత్ వాడినా.. అసలు పూర్తిగా వాడకపోయినా సరే.. కనీసం రూ.400 బిల్లు బాదేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉమ్మడి విశాఖ జిల్లాలో విద్యుత్ వినియోగదారుల మీద నెలకు రూ.250 కోట్లకు పైగా భారం పడుతోంది.

వేసవిలోబిల్లులు తడిసి మోపెడు.!

వివిధ రకాల విద్యుత్ చార్జీల వసూలుతో చలికాలంలో విద్యుత్ వాడకం తగ్గినా బిల్లులు మాత్రం పెరుగుతుండడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సగటున యూనిట్ ధర రూ.3.21 ఉంటే.. ప్రస్తుతం యూనిట్ ధరకు ఐదు రెట్లు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. దాదాపు 13 రకాల సుంకాలను వసూలు చేస్తుండడంతో యూనిట్ ధర రూ.15 వరకూ ఉంటోంది. బిల్లు చెల్లించడంలో కాస్తా జాప్యం జరిగినా.. అపరాధ రుసుముతో సహా బిల్లులు వసూలు చేయాలని డిస్కమ్‌లకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేశాయి. చలికాలంలోనే వేల రూపాయల బిల్లులు బాదేస్తున్న ఈపీడీసీఎల్.. రాబోతున్న వేసవిలో బిల్లులు కట్టేందుకు ఆస్తులన్నీ అమ్ముకోవాలేమోననే ఆందోళన చెందుతున్నారు.



ఒక యూనిట్ వినియోగానికి రూ.400 బిల్లు వేసిన ఈపీడీసీఎల్

బిల్లులు జేబులకు చిల్లులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు అసలు కంటే కొసరు చార్జీలే షాక్ కొడుతున్నాయి. వివిధ రకాల చార్జీల పేరుతో గత రెండు మూడు నెలలుగా ఈపీడీసీఎల్ జారీ చేస్తున్న బిల్లులు జనం జేబులకు చిల్లులు పెడుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులు 18,44,549 మంది ఉండగా.. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు రూ.5,360.52 కోట్లు వినియోగదారుల నుంచి ఈపీడీసీఎల్ వసూలు చేస్తోంది. ఎఫ్‌పీపీసీఏ, ఎఫ్‌పీపీసీఏ-2, ఎఫ్‌పీపీసీఏ-3.. ఇలా పలు రకాల చార్జీల భారం మోపేస్తోంది. ఇలా మొత్తంగా ప్రతి నెలా రూ.250 కోట్లను విద్యుత్ వినియోగదారుల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేస్తోంది.

క్లుప్తంగా

మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

రాంబిల్లి (యలమంచిలి) : మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని గురువారం అనకాపల్లి మహిళా పోలీస్ డీఎస్పీ శ్రీనివాసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. రాంబిల్లి సీఐ సీహెచ్.నరసింగరావు తెలిపిన వివరాలివి. రాంబిల్లి మండలం అప్పారాయుడుపాలెం గ్రామానికి చెందిన మైనర్‌బాలికపై అదే గ్రామానికి చెందిన సేనాపతి నాగేంద్ర (20) ఈ నెల 10వ తేదీన లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు నిందితుడిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచడమైందని తెలిపారు.

తాగి వాహనం నడిపిన ఏడుగురికి జైలు

- 37 మందికి జరిమానా

యలమంచిలి రూరల్ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పోలీసులకు పట్టుబడిన మందుబాబులకు కోర్టు భారీగా జరిమానాలు, జైలు శిక్ష విధించింది. యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ బి.రామకృష్ణ విలేకరులకు తెలిపిన వివరాలివి. గత 15 రోజులుగా నమోదు చేసిన 44 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి నిందితులను గురువారం యలమంచిలి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా మద్యం తాగి వాహనాలు నడిపిన వారిలో 37 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా, మరో ఏడుగురికి మూడురోజులు జైలు శిక్ష విధించారు.

గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన దేవి(32) కాకినాడ ఆస్పత్రిలో గురువారం మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ పవన్ తెలిపారు. బుధవారం బుచ్చియ్యపేట నుంచి కాకినాడకు భార్య దేవి, కుమార్తెను తీసుకుని బైకుపై వెళ్తున్న కూరగణేష్‌ను అడ్డురోడ్డు సమీపంలో వెనక నుంచి వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవి తలకి గాయమైంది. స్థానికులు ఆమెను నక్కపల్లి ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు హెచ్‌సీ తెలిపారు. వివరాలు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ముగ్గురు వ్యక్తుల అదృశ్యంపై ఫిర్యాదు

నర్సీపట్నం : నర్సీపట్నం పోలీసు స్టేషన్‌లో ముగ్గురు వ్యక్తులు అదృశ్యం అయినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ జి.గోవిందరావు తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ కాపు వీధిలో నివాసం ఉంటున్న బి.రాజేష్, అతని తల్లి బి.రాణి, అమ్మమ్మ పెనుమచ్చు చక్రమ్మ మిస్సింగ్ అయినట్టు పట్టణ పోలీసుస్టేషన్‌లో బంధువులు ఫిర్యాదు చేశారని, వీరు అప్పుల బాధల కారణంగా గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు బంధువులు తెలిపారని సీఐ పేర్కొన్నారు. వారి ఆచూకీ కోసం గాలిస్తున్నామని సీఐ గోవిందరావు తెలిపారు.

భీమిలి ప్రేమలు

వెండితెర ప్రేమకథలకు చిరునామా

ప్రేమకథా చిత్రాలకు ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. తరాలు.. అభిరుచులు మారుతున్నా ప్రేమకథా చిత్రాలకు ఆదరణ మాత్రం తగ్గదు. ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే భావోద్వేగాలు, మధురమైన సంగీతం, హీరో హీరోయిన్ల కెమిస్ట్రీ వెరసి ప్రేమకథా చిత్రాలు మర్చిపోలేని అనుభూతిని మిగులుస్తాయి. అందుకే ఈ జానర్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద విజయదుందుభి మోగిస్తుంటాయి. ఎన్నో ప్రేమకథా చిత్రాల ద్వారా ఎంతో మంది నటీనటులు వెలుగులోకి వచ్చారు. కేవలం నటీనటులే కాదు, ఈ చిత్రాలు చిత్రీకరించిన ప్రాంతాలు కూడా సినీ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయాయి. వాటిలో కొన్ని ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలుగా కూడా అభివృద్ధి చెందాయి. అలాంటి వాటిలో భీమిలి ఒకటి. – భీమునిపట్నం

ప్రేమ కథా చిత్రాల చిత్రీకరణకు భీమిలి స్వర్గధామంలా నిలిచింది. ఇక్కడ ఎన్నో సూపర్ హిట్ ప్రేమకథా చిత్రాలు చిత్రీకరించారు. ఇందుకు కారణం ప్రకృతి సౌందర్యం, ప్రశాంతమైన వాతావరణం, చారిత్రక కట్టడాలు.. ఇక్కడ సముద్రతీరం, పురాతన భవనాలు ఎంతో మంది సినీ దర్శకులను ఆకర్షించాయి. విశేషం ఏమిటంటే విభిన్న నేపథ్యాలున్న ప్రేమకథలకు భీమిలి సరిగ్గా సరిపోతుంది. పల్లెటూరి ప్రేమకథల నుంచి పట్టణ ప్రేమకథల వరకు, చారిత్రక ప్రేమకథల నుంచి సమకాలీన ప్రేమకథల వరకు ఏదైనా ఇక్కడ చిత్రీకరించవచ్చు.

ఇవే కాకుండా..

భీమిలి బీచ్, పరిసర ప్రాంతాల్లో శుభలేఖ, ముద్ద మందారం, మహర్షి తదితర తెలుగు చిత్రాలతో పాటు కొన్ని హిందీ, తమిళ చిత్రాల షూటింగ్‌లు కూడా జరిగాయి. 1991లో దర్శకుడు సెల్వమణి(ఆర్.కె.రోజా భర్త) రోజాతో 'చామంతి' అనే ప్రేమ కథా చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలోని ముఖ్య సన్నివేశాలను బ్యాంక్ రోడ్డులోని ఓషన్ వ్యూ బంగ్లా వద్ద చిత్రీకరించారు. 'రావోయి చందమామ', 'టైం' చిత్రాల్లోని ప్రేమ సన్నివేశాలను ఇక్కడే తీశారు. నరసింహస్వామి ఆలయం వద్ద శ్రీవారికి ప్రేమలేఖ, కోకిలమ్మ చిత్రాల షూటింగ్ జరిగింది. నవీన్ చంద్ర హీరోగా బ్రో, శ్రీనివాసరెడ్డి, పూర్ణ హీరోహీరోయిన్లుగా నటించిన జయమ్ము నిశ్చయమ్మురా, తాజాగా నాగచైతన్య నటించిన తండేల్ తదితర చిత్రాల షూటింగ్‌లు భీమిలి పరిసర ప్రాంతాల్లోనే జరిగాయి.



దర్శకుడు సెల్వమణి రోజాతో తీసిన చామంతి చిత్రంలో చాలా సన్నివేశాలు ఈ బంగ్లాలోనే తీశారు



ఆరాధనలో చిరంజీవి ఇల్లు ఇదే..



ఎన్నో ప్రేమకథా చిత్రాల షూటింగ్‌లు ఇక్కడే..

ఇప్పటికీ అలానే..

ఒక్క గాలిమేడ తప్పించి మిగిలిన నిర్మాణాలు ఇప్పటికీ అలానే ఉన్నాయి. బీచ్ దగ్గరలో గ్రంథాలయం పక్కన స్కూల్, దిమ్మ, దగ్గరలో ఇల్లు చెక్కు చెదరకుండా ఉన్నాయి ఇక్కడకు వచ్చే సందర్శకులు వీటిని చూడవచ్చు. బ్యాంక్ రోడ్డులో ఓషన్ వ్యూ బంగ్లా కూడా అలాగే ఉంది. ఇలా భీమిలి కేవలం సినిమా షూటింగ్‌లకే కాకుండా పర్యాటకంగా కూడా ఎంతో అభివృద్ధి చెందింది. సినిమాల్లో చూపిన అందమైన ప్రదేశాలను ప్రత్యక్షంగా చూడటానికి పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. మొత్తానికి ప్రేమకథా చిత్రాలకు, భీమిలికి విడదీయరాని అనుబంధం ఏర్పడింది.

జ్ఞాపకాల దొంతర.. ఆరాధన



చిరంజీవి, సుహాసిని నటించిన ఆరాధనలో పాఠశాల సన్నివేశాలు చిత్రీకరణ జరిగింది ఇక్కడే..


భీమిలి గ్రంథాలయం ఎదురుగా ఒకప్పుడు సరస్వతి సమాజం ఉండేది. ఇక్కడే 1986లో ప్రముఖ దర్శకుడు భారతీరాజా దర్శకత్వంలో సత్యరాజ్ (బాహుబలిలో కట్టప్ప), రేఖ నటించిన 'కడలోర కవితైగళ్' అనే తమిళ చిత్రాన్ని చాలా వరకు ఇక్కడే చిత్రీకరించారు. ఇదే సినిమాను భారతీరాజా 1987లో 'ఆరాధన' పేరుతో తెలుగులో పునర్నిర్మించారు. చిరంజీవి, సుహాసిని నటించిన ఈ 'ఆరాధన' సినిమా షూటింగ్ కూడా చాలా రోజులు భీమిలిలోనే జరిగింది. సుహాసిని విద్యా బోధన, చిరంజీవి చదువుకోవడానికి వచ్చే సన్నివేశాలు ఇక్కడ చిత్రీకరించారు. సుహాసిని పాఠశాలకు రావద్దని చెప్పడంతో చిరంజీవి దానికి ఎదురుగా ఉన్న దిమ్మపై ఒంటి కాలిపై నిలబడే సన్నివేశం, దగ్గరలో అప్పటి లైట్‌హౌస్ కీపర్‌కు సంబంధించిన క్వార్టర్స్‌లో చిరంజీవి ఇల్లు, ఆయనకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ ఇక్కడే జరిగింది.



ఆరాధనలో నటించిన అడిదం కిశోర్

మరో చరిత్ర.. చెరగని ముద్ర

భీమిలిలో చిత్రీకరించిన ఓ సినిమా పేరు చెప్పండి అంటే మరో ఆలోచన లేకుండా 'మరో చరిత్ర' అని చెబుతారు. ఇక్కడి అందమైన లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సినిమా 1978లో విడుదలై అందరి మనసుల్లో చెరగని ముద్ర వేసింది. కె.బాలచందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కమలహాసన్, సరిత ముఖ్య పాత్రలు పోషించారు. 1850 ప్రాంతంలో డచ్ గవర్నర్ నివసించడానికి అరుదైన బంగ్లా నిర్మించారు. దీనిని 'గాలిమేడ' అని పిలిచేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దానిని ఎవరూ ఉపయోగించకుండా వదిలేశారు.'మరోచరిత్ర' చిత్రంలోని ముఖ్యమైన సన్నివేశాలు, ఒక పాట ఈ గాలిమేడలోనే చిత్రీకరించారు. సినిమా పెద్ద విజయం సాధించడంతో ఈ బంగ్లాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. సినిమా విడుదలైన తర్వాత ఈ గాలిమేడను చూడటానికి నిత్యం అనేక మంది సందర్శకులు వచ్చేవారు. అయితే 1990 ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులు ఈ స్థలాన్ని కొనుగోలు చేసి గాలిమేడను కూల్చివేశారు. కానీ ఇప్పటికీ చాలా మంది ఆ ఖాళీ స్థలాన్ని చూసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు.



మరోచరిత్ర షూటింగ్ జరిగిన గాలిమేడ(ఫైల్)

ఆరాధన సినిమాలో నటించాను



ఆరాధన చిత్రం ఇక్కడ సుమారు రెండు నెలల పాటు చిత్రీకరణ జరిగింది. అప్పుడు నేను 8వ తరగతి చదువుతున్నాను. ఈ సినిమాలో విద్యార్థిగానే కాకుండా, చిరంజీవి ఒంటి కాలిపై నిలబడే సన్నివేశంలో, నేను పరుగెత్తుకుంటూ వచ్చి ఆయన్ని ఆశ్చర్యంగా చూసే సన్నివేశంలో నటించాను. రోజూ ఉదయం ఏడు గంటల సమయంలో అందరికన్నా ముందు హీరోయిన్ సుహాసిని వచ్చేవారు. షూటింగ్ ప్రారంభమయ్యే లోపు నాతో పాటు మరికొందరు పిల్లలతో ఆటలు ఆడుకున్నారు. ఆ రోజులు ఇప్పటికీ గుర్తున్నాయి.

– అడిదం కిశోర్, భీమిలి,

ఎంతో సందడిగా ఉండేది



ఇక్కడ షూటింగ్‌లు ఎక్కువ రోజులు జరగడం వల్ల ఎంతో సందడిగా ఉండేది. పరిసర ప్రాంతాల నుంచి సినిమా షూటింగ్‌లు చూసేందుకు చాలా మంది తరలివచ్చారు. ముఖ్యంగా 'ఆరాధన' షూటింగ్ చాలా రోజులు జరగడం, చిరంజీవి హీరో కావడంతో విశాఖ, విజయనగరం ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనం వచ్చారు. వారిని అదుపు చేయడానికి పోలీసులు, చిత్ర యూనిట్ చాలా ఇబ్బందులు పడింది.

– టి.భీమారావు, భీమిలి

పనులు మానుకుని వెళ్లేవాళ్లం



ఇక్కడ షూటింగ్‌లు జరిగే సమయాల్లో చూసేందుకు వెళ్లేవాళ్లం. చిరంజీవి, సుహాసిని ఇతర నటీనటులను చూసేందుకు చాలా మంది ఆసక్తి చూపారు. ఆ రోజుల్లో పనులు కూడా మానుకుని షూటింగ్ చూడటానికి వెళ్లా

– ముగ్గు సూర్యకాంతం, భీమిలి



బడిలోకి రానివ్వాలని చిరంజీవి ఒంటి కాలిపై నిలబడ్డ సన్నివేశం చిత్రీకరణ ఈ దిమ్మపైనే జరిగింది

వైభవంగా కేశవస్వామి పుష్పాంజలి సేవ

- ముగిసిన 752వ వార్షిక బ్రహ్మోత్సవాలు



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

చోడవరం: శ్రీకేశవస్వామివారి పుష్పాంజలి సేవ కనువిందుగా జరిగింది. వందలాది మంది భక్తులు స్వామివారి ఊంజల సేవలో పాల్గొని తరించారు. ఉత్తరాంధ్రలో ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన చోడవరం కేశవస్వామివారి 752వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రితో ముగిశాయి. ఈ నెల 7న ప్రారంభమైన ఉత్సవాలు ఏడు రోజుల పాటు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి పుష్పాంజలి సేవ ఘనంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణాన్ని రకరకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలో శ్రీదేవి, భూదేవి, కేశవ స్వామి ఉత్సవమూర్తులను ఉంచి వేద పండితులు సీతారామాచార్యులు, రామకృష్ణచార్యులు ఊంజల సేవ చేశారు. పూలు, రకరకాల పండ్లతో ఆలయాన్ని అలంకరించారు. మహిళలు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ మూర్తులను చోడవరం పట్టణ పురవీధుల్లో వైభవంగా తిరువీధోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



పూలతో అలంకరించిన ఆలయ ప్రాంగణం

భూఆక్రమణపై పల్లావూరు గ్రామస్తుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పల్లావూరు గ్రామస్తులు

నర్సీపట్నం: భూఆక్రమణను నిరసిస్తూ గొలుగొండ మండలం నాగాపురం పంచాయతీ శివారు పల్లావూరు గ్రామస్తులు గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఆక్రమణ భూమిలో చేపడుతున్న నిర్మాణాలను తక్షణం నిలిపివేయాలని నినాదాలు చేశారు. అనంతరం సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆర్డీవో వి.వి.రమణను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 39లో 30 సెంట్ల భూమిని బడి, గుడి, వాటర్ ట్యాంక్, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిందని గ్రామస్తులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన పి.దేవుడు అనే వ్యక్తి రాజకీయ అండతో ఈ స్థలాన్ని ఆక్రమించాడని చెప్పారు. అందులో మొదట పాకలు వేస్తే గ్రామస్తులంతా అభ్యంతరం చెప్పారు. గ్రామానికి అవసరమైనప్పుడు స్థలం ఖాళీ చేస్తానని నమ్మించి, కాలక్రమంలో స్థలానికి దొంగ డాక్యుమెంట్లు సృష్టించి స్వాధీనం చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. రామాలయం, తాగునీటి ట్యాంక్‌కు వెళ్లేందుకు దారి కూడా వదలకుండా ప్రస్తుతం ప్రహరీ నిర్మాణం చేపడుతున్నాడని, తక్షణమే పనులు నిలిపివేయాలని ఆర్డీవోను కోరారు.

బంగారం దొంగ దొరికాడు

- చోరీ సొత్తు స్వాధీనం
- కేసు ఛేదించిన మునగపాక పోలీసులు

మునగపాక : మండలంలోని గణపర్తిలో ఇటీవల జరిగిన బంగారం చోరీకి సంబంధించిన నిందితుడిని మునగపాక పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. సంబంధిత బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని చోరీకి పాల్పడిన నిందితున్ని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో కృషి చేసిన ఇద్దరు కానిస్టేబుళ్లను పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ అభినందించి వారికి నగదు రివార్డు అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన గురువారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 10న గణపర్తికి చెందిన కాండ్రేగుల సన్యాసమ్మకు చెందిన మూడుతులాల ముప్పావు బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తి తస్కరించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విచారణను వేగవంతం చేసి నిందితుడిని పట్టుకొని వివరాలు రాబట్టారు. కశింకోటకు చెందిన మజ్జి శ్రీధర్ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. అతని నుంచి 2 తులాల బంగారు తాడు, తులం ముప్పావు నల్లపూసలు స్వాధీనం చేసుకొని అతనిని అరెస్టు చేశారు. కేసు విచారణకు సంబంధించి విశేష కృషి చేసిన కానిస్టేబుళ్లు లీలా కృష్ణ, రమణలకు డీఎస్పీ విష్ణు స్వరూప్ నగదు రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా విష్ణు స్వరూప్ విలేకరులతో మాట్లాడుతూ కొందరు యువకులు బెట్టింగ్ పేరుతో లక్షలాది రూపాయలను పోగొట్టుకుంటున్నారని, తద్వారా చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కదలికల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.



చోరీ నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన కానిస్టేబుళ్లకు రివార్డులు అందజేస్తున్న సీఐ స్వరూప్, ఎస్ఐ ప్రసాదరావు

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని అనుచరుల అరెస్ట్

ఆరిలోవ : మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులను విశాఖలో పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొన్నారు. గురువారం తెల్లవారుజామున విజయవాడ పోలీసులు విశాఖ చేరుకొని ఆరిలోవ పోలీసుల సహకారంతో విశాలాక్షినగర్‌లో ఇంటిని చుట్టుముట్టారు. విజయవాడ నుంచి వచ్చిన ముగ్గురితో పాటు ఆ ఇంటి యజమాని ఎలినేని దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఇక్కడ నుంచి విజయవాడకు తీసుకెళ్లారు. బంధువులతో పాటు దుర్గాప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేయడంపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల తీరును తప్పపడుతున్నారు. ఇదిలా ఉండగా విజయవాడ పోలీసులకు సహకారం అందించామని, ఎవరిని అరెస్టు చేశారో తమకు తెలియదని ఆరిలోవ పోలీసులు వెల్లడించారు.

మేము టీడీపీ అభిమానులం

మేము టీడీపీ అభిమానులం.. టీడీపీ గెలిచినప్పుడు సంబరాలు చేసుకున్నాం.. తన కుమారుడు ఎలినేని దుర్గాప్రసాద్‌ను ఇప్పుడు ఎందుకు అరెస్టు చేశారో పోలీసులు చెప్పడం లేదని ఆయన తల్లి శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ నుంచి బంధువులు వచ్చారని.. వారిని కూడా అకారణంగా అరెస్టు చేశారని వాపోయారు. పోలీసులు తన కుమారుడితో మిగతా ముగ్గురిని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



మృతుడు కిరణ్

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామంలో గల రావాలమ్మ ఆలయం సమీపంలో గురువారం జరిగిన బైకు ప్రమాదంలో అప్పికొండ కిరణ్(22) అనే యువకుడు మృతి చెందాడు. పెందుర్తి నుండి కె.కోటపాడు మీదుగా తన స్నేహితుడు పెంటకోట మోహన్‌తో కలిసి కిరణ్ బైక్‌పై వెళుతుండగా రావాలమ్మ ఆలయం దాటిన తరువాత ద్విచక్ర వాహనం ఒక్కసారిగా స్కిడ్ అయ్యింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న కిరణ్ తల రోడ్డును బలంగా ఢీకొట్టడంతో పాటు ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఘటనాస్థలంలోనే కిరణ్ మృతిచెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న మోహన్‌కు కాలిపై స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అరగంటలో ఇంటికి చేరుకోవాల్సిన కుమారుడు ప్రమాదానికి గురై మృతిచెందాడని తెలిసి మృతుడు తండ్రి బాబూరావు భోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. మృతుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి తరలించారు.

బంగారమ్మపాలెం తీరంలో గుర్తు తెలియని మృతదేహం

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం తీరంలో గుర్తు తెలియని మృతదేహం గురువారం ఒడ్డుకు కొట్టుకు వచ్చిందని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. మృతుడిని 35 నుంచి 40 సంవత్సరాలు వయస్సు కలిగి వ్యక్తిగా గుర్తిచామన్నారు. శరీరంపై గల గ్రీన్ కలర్ టీషర్టుపై ఆర్‌జియుకెటి ఏపి అని ముద్రించి ఉందని చెప్పారు. వివరాలు తెలిసిన వారు ఎస్.రాయవరం పోలీసులను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వం ఆసుపత్రిలో భద్రపరిచినట్టు చెప్పారు. వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

క్రెబ్స్ పరిశ్రమ మూసివేతకు ఆదేశాలు!

కశింకోట :

మండలంలోని తేగాడ వద్ద నిర్వహిస్తున్న క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమను మూసివేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు అధికారులు క్రెబ్స్ పరిశ్రమను గురువారం పరిశీలించినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ పరిశ్రమలో తయారైన రసాయన ఉత్పత్తుల వ్యర్థాలను ఇటీవల కాంట్రాక్టర్ తరలిస్తూ విజయవాడ సమీపంలోని పొలాల్లో వేశారు. ఇందుకు బాధ్యులను చేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు అనుసరించి పరిశ్రమను మూసివేయాలని కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు ఆదేశించారు.

కాంట్రాక్టర్ తప్పిదంపై ఫిర్యాదు

వ్యర్థాల తరలింపులో తమకు సంబంధం లేదని, వీటిని పొలాల్లో పడవేసిన కాంట్రాక్టర్ తప్పిదంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ క్రెబ్స్ పరిశ్రమ యాజమాన్యం గురువారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటన తమ పరిధిలో కానందున కేసు నమోదు చేయలేదని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు.

తరాలు మారినా తరగని సంప్రదాయాలు

- మాఘపౌర్ణమి జాతరలో పూడిమడక ఆడపడుచుల సందడి





సందడిగా పూడిమడక వీధులు (ఇన్‌సెట్) జాతరలో మహిళలు చేతికి గాజులు తొడుక్కుంటున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్: తరాలు మారినా పల్లె సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు ప్రాణం పోస్తారు పూడిమడక ఆడపడుచులు. జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడక మాఘ పౌర్ణమి జాతరలో మహిళల సందడి అంతా ఇంతా కాదు. సంవత్సరంలో ఎన్నో గ్రామ పండగలు జరిగినప్పటికీ పూడిమడకలో మాఘ పౌర్ణమి జాతర మహిళలకు ఎంతో ప్రత్యేకత. జాతరకు గ్రామస్తులు తమ ఇంటి ఆడపడుచులను ఆహ్వానించడం ఆనవాయితీ. మాఘ పౌర్ణమి జాతర గురువారం కూడా అలానే కొనసాగింది. పూడిమడక వీధులన్నీ చిరు వ్యాపారులతో నిండిపోయాయి. మహిళలు, పిల్లలతో గ్రామం అంతా సందడి వాతావరణం నెలకొంది. ఈ జాతరలో అలంకరణకు సంబంధించిన సామగ్రి, స్టీల్, ఇత్తడి, రాగి సామాన్లు ఎక్కువగా కొనుగోలు చేశారు. పలువురు మహిళలు చేతులకు కొత్త గాజులు వేసుకుని మురిసిపోయారు.

అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య



మృతురాలు నాగరాజు(ఫైల్)

నర్సీపట్నం : ఆరోగ్య సమస్యల కారణంగా ఓ వృద్ధురాలు పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని నర్సీపట్నం టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. నాతవరం మండలం, డి.యర్రవరం గ్రామానికి చెందిన శొంఠ్యాన నాగరాజు(75) ఈ నెల 10వ తేదీన ఇంటి నుండి బయటకు వచ్చేసింది. ఆరోజు నుంచి బంధువులు ఆమె కోసం గాలిస్తున్నారు. గురువారం నర్సీపట్నం పెద్దచెరువులో శవమై తేలింది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుంది. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్య సమస్యల కారణంగా వృద్ధురాలు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని సీఐ తెలిపారు. మృతురాలి కుమారుడు నూకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో గురువారం పది మద్యం సీసాలను తరలిస్తుండగా, పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. గోనె సంచిలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ఎస్ఐ పి. మనోజ్‌కుమార్ కేసు నమోదు చేశారన్నారు.

'రాష్ట్ర ప్రయోజనాలపై నిలదీయాలి'

అనకాపల్లి టౌన్: పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాలపై ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని జిల్లా ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చిన్ని యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ఎత్తు కుదింపు, తదితర అంశాలపై ఎంపీలు తమ వాణిని వినిపించాలని కోరారు.

ప్రభుత్వ స్థలంలో దుకాణాల నిర్మాణాలు



ప్రభుత్వ స్థలంలో దర్జాగా దుకాణాలు నిర్మిస్తున్న ఆక్రమణదారులు

అనకాపల్లి: మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ, సీతారామాలయం సమీప ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి రెండు దుకాణాలను నిర్మిస్తున్నారు. అధికార పార్టీని అడ్డం పెట్టుకుని వీటిని దర్జాగా నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో దశలు వారీగా ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పునాదుల వరకూ నిర్మాణం చేసినప్పటికీ అక్కడ వీఆర్వో, సచివాలయం ఉద్యోగులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 6,537 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,850	4,700
మొదటి రకం	3,600	4.230
రెండో రకం	3,170	3,700
మూడో రకం	2,850	3,160

అనకాపల్లి సినిమాలు

ఇట్స్ కాంప్లికేటెడ్	:రాజా
ఆరెంజ్	:సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1(మ్యాట్నీ, 1,2 షోలు)
కెప్టెన్ అమెరికాతెలుగు వెర్షన్	:సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
సూర్య కృష్ణన్	:వెంకటేశ్వర(ఉదయం)
తల	వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
లైలా	:శ్రీసత్య
బ్రహ్మానందం	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 54 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-34 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 396 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 341 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

పదింతల ప్రణాళికతో..



పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందజేస్తున్న ఉపాధ్యాయులు

- పదో తరగతి పరీక్షలకు ప్రత్యేక తరగతులు
- పట్టణ, మండలంలో 1,460 మంది విద్యార్థులు
- సీ,డీ విభాగం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- పరీక్షలంటే భయం తొలగింపు
- రోజు విద్యార్థి చదివిన సబ్జెక్టుపై పరీక్ష

అనకాపల్లి: ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరీక్షలకు హాజరయ్యే **విద్యార్థుల కోసం నెల రోజుల ముందు నుంచే పక్కా** ప్రణాళికతో బోధిస్తున్నారు. వెనుకబడిన వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పట్టణ, మండలంలో 1,460 మంది విద్యార్థులు మార్చి 17 నుంచి జరిగే పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు. వీరిని ఏ, బీ, సీ, డీ విభాగాలుగా గతేడాది డిసెంబర్‌లో విభజించి పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు. జనవరి 1 నుంచి మార్చి 10 తేదీ వరకూ ప్రభుత్వం వంద రోజులు యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఏ, బీ విభాగంలో 819 మంది, సీ, డీ విభాగంలో 641 మంది విద్యార్థులకు రోజూ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు.

ప్రధానంగా పబ్లిక్ పరీక్షలు రాసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉదయం, సాయంత్రం సమయంలో అదనంగా రెండు గంటలు సమయాన్ని కేటాయించారు. పాఠశాల వేళల్లో తరగతి గదుల్లో ఉదయం రెండు, మధ్యాహ్నం రెండు సబ్జెక్టులు చొప్పున బోధిస్తున్నారు. విద్యార్థులకు అర్థమైన రీతిలో తరగతి గదుల్లో బోధన చేస్తూ, అదే రోజు పరీక్షలు నిర్వహించడం వల్ల వారిలో భయాన్ని తొలగిస్తున్నారు. వంద రోజులు ప్లాన్‌లో భాగంగా మరో 25 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏ, బీ విభాగంలో 819 మందికి కొంత సమయాన్ని కేటాయించి, నేటి వరకూ చదువుతున్న సబ్జెక్టులపై ఉన్న అనుమానాలను తొలగిస్తున్నారు.

ఇళ్లకు వెళ్లి పరిశీలన...

సీ, డీ విభాగంలో 641 మంది విద్యార్థులు ఉండగా, వీరిలో డీ విభాగంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వారి గృహాలకు ఉపాధ్యాయులు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడటం, విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు, పదో తరగతి పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు అనుకూలమైన వాతావరణం ఉందా లేదా అనేది పరిశీలిస్తున్నారు. మొత్తం మీద పదో తరగతిలో శతశాతం మార్కులు తెచ్చుకుని మంచి ఫలితాలు సాధించే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో సీ, డీ విభాగంలో విద్యార్థులకు ప్రత్యేకంగా బోధిస్తున్నారు. గణితం, ఆంగ్లం, సైన్స్ సబ్జెక్టులపై భయాన్ని పోగొట్టేలా మెలకువలు నేర్పిస్తున్నారు.



జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో తరగతి గదిలో చదువుతున్న పదోతరగతి విద్యార్థులు

ఆరోగ్యం కోసం పౌష్టికాహారం...

పౌష్టికాహారం అందజేయడం వంటి అనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సాయంత్రం సమయంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో స్నాక్స్ అందిస్తున్నారు. ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండి, పరీక్షలు **ప్రశాంతంగా రాసేందుకు వీలు ఉంటుంది. ఆ దిశగా** విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో పౌష్టికాహారం అందిస్తున్నారు.

ప్రీ ఫైనల్ పరీక్షలు....

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ నెల 20వ తేదీ వరకూ ప్రీ ఫైనల్ పరీక్షలు రాయిస్తున్నారు. ఈ పరీక్షలు రోజూ ఉదయం, మధ్యాహ్న సమయంలో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు రాసే వారిలో నైపుణ్యాన్ని గుర్తించడం వల్ల, వెనుకబడిన వారికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి పబ్లిక్ పరీక్షలు సులభంగా **రాసేలా తీర్చిదిద్దుతున్నారు.**

మంచి మార్కులు సాధించేలా శిక్షణ..



పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు నాలుగు విభాగాలుగా ఉపాధ్యాయులు విభజించారు. ప్రస్తుతం నేను సీ విభాగంలో చదువుతున్నా. బీ విభాగంలో వచ్చేందుకు కష్టపడి చదువుతున్నాను. ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టులు అంటే కొద్దిగా భయంగా ఉంది. సాయంత్రం ఉపాధ్యాయులు రెండు సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. **పరీక్షల్లో మార్కులు** సాధించే విధంగా తర్ఫీదు ఇస్తున్నారు.

ఎ.జ్యోతి స్వరూప్, జీవీఎంసీ పెద్ద హైస్కూల్, పదో తరగతి విద్యార్థి, అనకాపల్లి

చెప్పింది అర్థమైనా మర్చిపోతున్నా



ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠశాలు చెప్పినప్పుడు బాగానే అర్థమవుతోంది. తర్వాత మర్చిపోతున్నారు. 100 రోజుల శిక్షణ బాగుంది. ప్రస్తుతం నేను డీ విభాగంలో ఉన్నాను. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 50 శాతం మార్కులు సాధించే విధంగా చదువుతున్నాను. **బి.అపేష్,** పదో తరగతి విద్యార్థి,

జీవీఎంసీ పెద్ద హైస్కూల్, అనకాపల్లి

విద్యార్థుల్లో భయాన్ని తొలగిస్తున్నాం....

ఈ ఏడాది పట్టణ, మండల పరిధిలో 1460 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వారిలో భయాన్ని తొలగిస్తున్నాం. సీ, డీ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి రాత్రి సమయంలో వారి ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహించడం, రోజూ చదివిన సబ్జెక్టుపై పరీక్షలు నిర్వహించి మానసికంగా సన్నద్ధం చేస్తున్నాం. నెల రోజుల పాటు పదో తరగతి విద్యార్థులపై వారి తల్లిదండ్రులు దృష్టి సారించాలి. క్రమం తప్పకుండా స్కూల్‌కు వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– కోటేశ్వరరావు, ఎంఈవో–2, అనకాపల్లి

పట్టణంలో దుర్గంధం



మెయిన్‌రోడ్డులో ఎల్లయ్యకాలనీలో చెత్తాచెదారం

అనకాపల్లి: పట్టణ ప్రజలు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. దోమకాటుకు గురై వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ఇక్కడ ప్రధాన కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. స్థానిక మెయిన్‌రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం వెనుక ఎల్లయ్య కాలువలో ఐదు మాసాలుగా మురుగు పేరుకుపోయింది. మురుగు ముందుకు కదలకపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. వైఎస్సార్‌సీపీ పాలనలో వీటిని నాలుగు మాసాలకు ఒక్కసారైన శుభ్రం చేసేవారని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. కూటమి పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి శుభ్రం చేసి, దోమల నిర్మూలనకు మందు పిచికారీ చేయాలని కోరుతున్నారు.

జీతాలు చెల్లించాలని సిబ్బంది నిరసన

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ పరిధిలో చెత్త సేకరణకు పని చేస్తున్న క్లాప్ వాహన లోడర్లకు బకాయిపడ్డ జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక వాహన యార్డు వద్ద జీతాలు చెల్లించాలని గురువారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా లోడర్లకు కాంట్రాక్టర్ జీతాలు చెల్లించలేదని, వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తక్షణమే జీతాలు చెల్లించకపోతే సోమవారం నుంచి చెత్త సేకరణ నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి భారతి, భాస్కరరావు, భవాని తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు కాస్త పెరిగాయి. ఉల్లి ధర పెరగ్గా, టమాటా ధర తగ్గింది. బీరకాయ బెట్టు దిగలేదు. కిలో ఉల్లి రూ.30 నుంచి రూ.40కి పెరిగింది. టమాటా రూ.15 నుంచి రూ.10కి, క్యారెట్, బీట్రూట్ రూ.60 నుంచి రూ.50, చిక్కుడుకాయ, గోరు చిక్కుడు రూ.60 నుంచి రూ.40కి తగ్గాయి. వంకాయ రూ.20, బంగాళదుంప, దొండకాయ రూ.30, బెండకాయ రూ.60, క్యాప్సికం రూ.80, బీరకాయ రూ.వందకు విక్రయాలు సాగాయి.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

అనకాపల్లి: క్రిమిసంహారక మందు తాగి బి. వెంకట సత్యారావు(59) స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై వివరాల మేరకు... స్థానిక లోకా వారి వీధికి చెందిన వెంకట సత్యారావు మెయిన్‌రోడ్డులో శ్రీధరాల పైడిశెట్టి స్వగృహం వద్ద పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇంటి తాలూకా డాక్యుమెంట్స్ తీసుకుని రావాలని ఓనర్ పైడిశెట్టి కొన్ని రోజులుగా వేధిస్తుండటంతో మనస్తాపం చెంది ఈ నెల 11న క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

యలమంచిలి రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. బాలికలంతా విద్యతో ఆటలకు ప్రాధాన్యమివ్వాలని ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. స్పోర్ట్స్ కిట్లు పంపిణీకి ముందు సెయింట్ గోబిన్ సంస్థ ప్రతినిధులు 6 నుంచి 9వ తరగతి విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. స్పోర్ట్స్ కిట్లలో రెండు టీ షర్టులు, బూట్లు, సాక్సు, శానిటరీ పాడ్లు, ఇతర ఆట వస్తువులు ఉన్నాయి. ప్రధానోపాధ్యాయిని వీవీ హిమబిందు, యాజమాన్య కమిటీ ప్రతినిధి ఆడారి ఆదిమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కిట్లతో విద్యార్థినులు, నాంది ఫౌండేషన్ ప్రతినిధులు

298 మందికి ఉపాధి అవకాశాలు



పెందుర్తి: ప్లేస్‌మెంట్‌కు ఎంపికైన విద్యార్థులు



సబ్బవరం: ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

- పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 186 మంది, సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 112 మంది ఎంపిక

పెందుర్తి: చెన్నైలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థలో ఉపాధి కోసం కోస్తా జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 261 మంది విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొనగా పెందుర్తి నుంచి 113 మంది, నర్సీపట్నం నుంచి 46, ఆముదాలవలస నుంచి 17, కాకినాడ నుంచి 10 మంది కలిపి మొత్తం 186 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. వీరికి ఏడాదికి రూ.2.2 లక్షల ప్యాకేజీ అందుతుందన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ యు.జయలక్ష్మి, హెచ్‌వోడీలు డాక్టర్ ఎం.నాగమణి, డాక్టర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 112 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. నక్కపల్లిలోని హెటిరో ఫార్మా, అచ్యుతాపురంలోని యొకోహోమా టైర్స్ కంపెనీలో ఖాళీల భర్తీకి ఆయా కంపెనీల ప్రతినిధులు ఈ డ్రైవ్ నిర్వహించారు. సబ్బవరం కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులతో పాటు, వివిధ ప్రాంతాలకు చెందిన 415 మంది అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరైనట్లు పేర్కొన్నారు. హెటిరో ఫార్మా కంపెనీకి 95 మంది, యొకోహోమాకు 17 మంది ఎంపికయ్యారని తెలిపారు. వీరిలో 25 మంది తమ కళాశాలకు చెందిన పూర్వవిద్యార్థులేనని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. కంపెనీ ప్రతినిధులు ఐ.నరేష్, ఎస్.సాయికుమార్ పాల్గొన్నారు.

పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యం

- సోమలింగపాలెంలో రాత్రి విద్యార్థుల ఇళ్లకు వెళ్లిన డీవైఈవో అప్పారావు



సోమలింగపాలెంలో విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలిస్తున్న డీవైఈవో అప్పారావు

యలమంచిలి రూరల్: పదో తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యా శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో వంద రోజుల పునశ్చరణ తరగతులు జరుగుతుండగా, రాత్రి సమయాల్లో ఆయా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఇళ్ల వద్ద ఏం చేస్తున్నరనే దానిపై ఆరా తీస్తున్నారు. వారిని వచ్చే నెలలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధులను చేయడానికి కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు, ప్రధానోపాధ్యాయులు తనిఖీలకు వెళ్లారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పరీక్షలు బాగా రాసేందుకు వారి పాత్ర కీలకమని చెప్పి అవగాహన కల్పించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. ఈ సారి ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఫలితాలు సాధిస్తారన్న నమ్మకం ఉందన్నారు. పోషకాహారంతో పాటు, 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలని సూచించారు. పలువురు విద్యార్థులు చదువుతున్న సబ్జెక్టులకు సంబంధించి వారి పురోగతి, సామర్థ్యాన్ని ఆయన పరీక్షించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీ హెచ్ శాస్త్రి, సోమలింగపాలెం ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ సాయిబాబా, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు పీఎస్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగపాక వీఆర్వోపై ఫిర్యాదు



డీటీ శేషుబాబుకు ఫిర్యాదు చేస్తున్న రైతు

మునగపాక: స్థానిక వీఆర్వో సురేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సత్యనారాయణ గురువారం డీటీ శేషుబాబుకు ఫిర్యాదు చేశారు. రీ–సర్వేలో లోపాలను సవరించేందుకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా, వీఆర్వో ఇంతవరకు ఎటువంటి న్యాయం చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో మామూళ్లు అడుగుతున్నారని, అతనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. తన భూమికి సంబంధించి అన్ని ఆధారాలున్నా కేవలం డబ్బుల కోసం పనులు ఆలస్యం చేస్తున్నారని వాపోయారు.

అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలని వినతి



సీఐ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందిస్తున్న టిడ్కో కాలనీవాసులు

పరవాడ: స్థానిక టిడ్కో కాలనీలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావును కోరారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో గురువారం సీఐకి మహిళలు వినతిపత్రం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఇక్కడ కాలనీలో ఇళ్లను అద్దెకు తీసుకొని, అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కాలనీలో బ్యాచ్‌లర్స్ ఇళ్లను అద్దెకు తీసుకొని తరచూ మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కాలనీలో అపరిచితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని, వీటి నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

రాచ్చెరువులో రోడ్డు నిర్మాణంలో వివాదం



రోడ్డు పనులను అడ్డుకున్న స్థానికులు

పెందుర్తి: జీవీఎంసీ 96వ వార్డులో జీవీఎంసీ నిధులతో చేపడుతున్న కాలనీల అంతర్గత రోడ్ల నిర్మాణాల్లో వివాదాలు కొనసాగుతున్నాయి. స్థానిక టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో రోడ్ల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయి. తాజాగా గురువారం పెందుర్తి రాచ్చెరువు ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణంలో వివాదం తలెత్తింది. ఇక్కడ రోడ్డు రెండు వైపులా ఒకేలా నిర్మాణం చేయడం లేదని స్థానికులు ఆందోళనకు దిగారు. ఓ వైపు టీడీపీ నాయకులకు అనుకూలంగా, మరోవైపు స్థానికులకు ఇబ్బందికరంగా రోడ్డును నిర్మిస్తున్నారంటూ పనుల్ని అడ్డుకున్నారు. దీంతో జీవీఎంసీ అధికారులు, స్థానిక కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు వచ్చి స్థానికులతో చర్చించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేపడతామని సర్ది చెప్పడంతో తాత్కాలికంగా ఆందోళన సద్దుమణిగింది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలకు కృషి



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రవికుమార్

పరవాడ: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి, వారి మన్ననలు పొందడానికి కృషి చేయాలని అనకాపల్లి జిల్లా వైద్యాధికారి రవికుమార్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు జరపడానికి అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. సాధారణ ప్రసవాలు ఆస్పత్రిలోనే నిర్వహించాలని సూచించారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించి, ఓపీ, ఫార్మసీ, రక్త పరీక్షలు జరిపే గదుల్ని తనిఖీ చేశారు. ఆయన వెంట పరవాడ వైద్యాధికారులు హారిక, జయశ్రీ కరిష్మా, కమ్యూనిటీ హెల్త్ అధికారి సాయిరామ్, యూడీసీ ఆనంద్‌కుమార్, స్టాఫ్ నర్స్ రాజేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ ఎం.అన్నపూర్ణేశ్వరి ఉన్నారు.

శతశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

సబ్బవరం: గ్రామాల్లో శతశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ఆర్.శిరీషరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని అసకపల్లి, పైడివాడ అగ్రహారం, సబ్బవరంలోని సంపద తయారీ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో త్వరితగతిన శతశాతం ఇంటి పన్నులు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడి పడితే అక్కడ పారబోస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులకు తగు సూచనలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు.